ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కరీంనగర్
5 జిల్లా వార్తలు
శుక్రవారం 30 ఆగస్టు 2024



బల్దియా ఆధ్వర్యంలో చికెన్ వ్యర్థాల సేకరణ

- చేపల ఫీడింగ్ కోసం ఆంధ్రాకు సరఫరా
- టెండర్ల నిర్వహణ
- రూ.40.11 లక్షలకు దక్కించుకున్న కాంట్రాక్టర్

కరీంనగర్ టౌన్, ఆగస్టు 29: ఒకప్పుడు చికెన్ వ్యర్థాలు ఖాళీ స్థలాలు, మురుగునీటి కాలువల్లో పడవేసే వారు. దీంతో దుర్వాసన, దోమలు, పందుల బెడద భరించలేక పోతున్నామని, వ్యాధులు ప్రబలుతున్నాయని, వ్యర్థాలు ఎక్కడ పడితే అక్కడ వేయకుండా చూడాలని ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చేవి. దీంతో చికెన్ సెంటర్ల నుంచి వెలువడుతున్న వ్యర్థాలను నివాస స్థలాల్లో, మురుగునీటి కాలువల్లో వేస్తే చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ నోటీసులు జారీ చేసేది. ఆ వ్యర్థాలను సేకరించేందుకు నామమాత్రంగా చెల్లించిన వారికి నగరపాలక సంస్థ నామినేషన్ పద్ధతిలో వర్క్ ఆర్డర్ ఇచ్చేది.సంవత్సరానికి రెండు, మూడు లక్షల ఆదాయం కార్పొరేషన్‌కు వచ్చేది. ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. హైదరాబాద్‌తోపాటు మరికొన్ని చోట్ల చేపల ఫీడ్ తయారీకి చికెన్ వ్యర్థాలను వినియోగిస్తుండడంతో ఇక్కడి నుంచి చికెన్ వ్యర్థాలను తీసుకువెళ్లేందుకు పోటీపడుతున్నారు. దీంతో నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న చికెన్ సెంటర్ల నుంచి ప్రతి రోజు నాలుగు నుంచి ఐదు టన్నులు, ఆదివారం వంటి సెలవు రోజులతోపాటు ఇతర పండుగ సమయంలో రెట్టింపు అంటే 10 టన్నుల మేరకు చికెన్ వ్యర్థాలు చికెన్ సెంటర్ల నుంచి వెలువడుతోంది. పార్లమెంట్ ఎన్నికలకు ముందు చికెన్ వ్యర్థాలను సేకరించేందుకు నగరపాలక సంస్థ టెండర్లను నిర్వహించింది. టెండర్లలో హైదరాబాద్‌కు చెందిన ఒక సంస్థ పాల్గొని 40.11 లక్షలు కోట్ చేసి కాంట్రాక్టును దక్కించుకుంది. వ్యర్థాల సేకరణతో గతంలో ఏడాదికి రెండు, మూడు లక్షల మేరకు మాత్రమే ఆదాయం రాగా, ఒకేసారి 40 లక్షలు రావడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. టెండర్లలో కాంట్రాక్టు దక్కించుకున్న వారు ప్రతి మూడు నెలలకొకసారి నాలుగు వాయిదాల్లో మొత్తం 40.11 లక్షలు చెల్లించాలని, మొదటి వాయిదా చెల్లిస్తే వర్క్‌ఆర్డర్ ఇస్తామని చెప్పడంతో సదరు కాంట్రాక్టర్ నిర్ణీత గడువులోనే 10.03 లక్షల మొత్తాన్ని నగరపాలక సంస్థకు చెల్లించడంతో జూన్‌లో వర్క్‌ఆర్డర్ ఇచ్చారు. దీంతో నగరపాలక సంస్థ పరిధిలోని చికెన్ సెంటర్ల నుంచి వ్యర్థాలను సేకరించడం ప్రారంభించారు.

● అనధికారికంగా సేకరణ

కొందరు వ్యక్తులు నగరపాలక సంస్థ నుంచి ఎలాంటి అనుమతి లేకుండా చికెన్ సెంటర్ల నుంచి వ్యర్థాలను సేకరిస్తున్నారు. దీనితో తనకు నష్టం వాటిల్లుతుందని, అనధికారికంగా వ్యర్థాల సేకరణ చేసే వారిపై చర్యలు తీసుకోవాలని, లేకపోతే నగరపాలక సంస్థకు వాయిదాలు చెల్లించలేనంటూ కాంట్రాక్టర్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. వారు పట్టించుకోకపోవడంతో మొన్నటివరకు ఇన్‌చార్జి కమిషనర్‌గా విధులు నిర్వహించిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్‌కి కాంట్రాక్టర్ ఫిర్యాదు చేశాడు. ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో కార్పొరేటర్ చాడగొండ బుచ్చిరెడ్డి ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ చికెన్ వ్యర్థాలను అనధికారికంగా సేకరించి లక్షలు సంపాదిస్తున్నారని, కాంట్రాక్టర్‌కు నష్టం వాటిల్లుతుందని ఫిర్యాదు చేసినా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. దీనితో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ ముందుగా చికెన్ సెంటర్ల నుంచి వ్యర్థాలను సేకరిస్తున్న వాహనాలను పట్టుకొని చర్య తీసుకోవాలని ఆదేశించారు. అయినా పట్టించుకోకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో బుధవారం పోలీసులు నగరంలో చికెన్‌సెంటర్ల నుంచి అనధికారికంగా వ్యర్థాలను సేకరిస్తున్న వాహనాన్ని పట్టుకున్నారు.

మంత్రి పొన్నం సీరియస్

చికెన్ వ్యర్థాలను అనధికారికంగా సేకరిస్తున్నారనే విషయాన్ని కాంగ్రెస్ కార్పొరేటర్లు, కాంట్రాక్టర్ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. అనధికారికంగా సేకరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. కాంట్రాక్టర్‌కు సహకరించాలని, నగరపాలక సంస్థ ఆదాయానికి గండిపడితే చూస్తూ ఊర్కొనేదిలేదంటూ సీరియస్‌గా చెప్పినట్లు సమాచారం. అనధికారికంగా చికెన్ వ్యర్థాలను సేకరిస్తున్న సదరు వ్యక్తులు నేరుగా ఆంధ్రాలోని చేపల చెరువులకు తరలించి లక్షల్లోనే ఆదాయం గడిస్తున్నారని, ఇందులో కొంత మంది రాజకీయ నాయకుల భాగస్వామ్యం ఉందని విమర్శలు వచ్చాయి.

ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో క్రీడల్లో రాణించాలి

- కలెక్టర్ పమేలా సత్పతి



మహిళా ఉద్యోగుల పరుగు పోటీలను జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 29: ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో క్రీడల్లో రాణించాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టేడియంలో జిల్లా స్థాయి ప్రభుత్వ ఉద్యోగుల క్రీడా పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో ఉద్యోగులకు క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలన్నారు. డీవైఎస్‌వో వి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఈ పోటీల్లో జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల నుంచి 120 మంది మహిళలు, పురుషులు పాల్గొంటున్నారని తెలిపారు. అనంతరం కలెక్టర్ జెండా ఊపి మహిళల 50 మీటర్ల పరుగు పోటీలను ప్రారంభించారు. అనంతరం పలు అంశాల్లో పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ సూపరింటెండెంట్ నర్సింహస్వామి, జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి వి వేణుగోపాల్, పెటా జిల్లా కార్యదర్శి ఎండీ యూనిస్ పాషా, ఫిజికల్ డైరెక్టర్లు ఆర్ నర్సయ్య, వి సూర్యప్రకాష్, వి రూపారాణి, బి వీర్‌పాల్, స్వప్న, నరేష్, హరీష్ పాల్గొన్నారు.

● క్రీడా పాఠశాలలో యోగా కేంద్రానికి స్థల పరిశీలన

కరీంనగర్ క్రీడా పాఠశాలలో యోగ కేంద్రం ఏర్పాటుకు కలెక్టర్ పమేలా సత్పతి స్థలాన్ని పరిశీలించారు. కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రాంతీయ క్రీడా పాఠశాలలో సౌకర్యాల కల్పన, వసతులపై అధికారులు, సిబ్బందితో గురువారం కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడా పాఠశాలలో పెద్ద టీవీని ఏర్పాటు చేసి ప్రతి వారం రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారుల విజయగాథను, చరిత్రను తెలిపే చిత్రాలను ప్రదర్శించాలన్నారు. క్రీడా పాఠశాల విద్యార్థులకు ప్రతి రోజు రాగి జావా, బెల్లం, విటమిన్ సి మాత్రలు ఇవ్వాలన్నారు. యోగా కేంద్రం ఏర్పాటుకు వసతి గృహం పైఅంతస్తును పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, ఆర్డీవో మహేశ్వర్, డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్, ప్రిన్సిపాల్ లీలాప్రసాద్ పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తాం

- త్వరలో పోస్టులన్నీ భర్తీ చేసి కోచ్‌లను నియమిస్తాం
- మంత్రి పొన్నం ప్రభాకర్



క్రీడా పాఠశాలలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 29: కరీంనగర్ క్రీడా పాఠశాలలో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తామని, కోచ్‌లను నియమిస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ప్రాంతీయ క్రీడా పాఠశాలలో గురువారం జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్య క్రమానికి హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రెండు క్రీడా పాఠశాలలు మంజూరు కాగా అందులో ఒకటి కరీంనగర్‌కు కేటాయించామని తెలిపారు. కరీంనగర్ క్రీడా పాఠశాలలో ఈత కొలను ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. క్రీడా పాఠశాలలో క్రీడాకారులకు అవసరమైన వివిధ రకాల ఆటవస్తువులను ఏర్పాటు చేయాలన్నారు. కరీంనగర్ క్రీడా పాఠశాలకు చెందిన క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా క్రీడాకారులతో మమేకమైన మంత్రి వారి కావాల్సిన సౌకర్యాలను గురించి అడిగి తెలుసు కున్నారు. వారికి అందిస్తున్న పోషకాహారం గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం క్రీడాకారులకు ట్రాక్‌సూట్‌తో పాటు స్పోర్ట్స్‌షూలను అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, ఆర్డీవో మహేశ్వర్, డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్, క్రీడా పాఠశాల ప్రిన్సిపాల్ లీలాప్రసాద్ పాల్గొన్నారు.

'పంచాయతీ' ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి

కరీంనగర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పంచాయతీ ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి కలెక్టర్లను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి ఆయన కలెక్టర్లతో పంచాయతీ ఎన్నికల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల దృష్ట్యా మండల, జిల్లా అధికారులు ప్రతి గ్రామ పంచాయతీలో ఓటర్ల వివరాలు సరిచూడాలన్నారు. ప్రతి 50మందికి ఒక పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఎటువంటి ఇబ్బందులు ఉన్నా జిల్లా ఎన్నికల యంత్రాంగం ప్రత్యేక చొరవ తీసుకుని పరిష్కరించాలన్నారు. సెప్టెంబరు 6న వార్డుల వారీగా ముసాయిదా ఓటర్ జాబితాను ప్రచురించాలని అన్నారు. ఈ జాబితాపై సెప్టెంబరు 7నుంచి 13వ తేది వరకు అభ్యంతరాలను స్వీకరించాలన్నారు. సెప్టెంబర్ 21న వార్డుల వారీగా తుది జాబితాను సిద్ధం చేయాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ... కుటుంబ సభ్యులందరికి ఒకే పోలింగ్ కేంద్రం, వార్డుల్లో ఓట్లు ఉండే విధంగా చేపట్టిన (ఓటరు మెర్జింగ్) ప్రక్రియను పూర్తి చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీకిరణ్, ప్రఫుల్‌దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్, జిల్లా పంచాయతీరాజ్ అధికారి రవీందర్, ఆర్డీవోలు మహేష్, రమేష్ పాల్గొన్నారు.

ఎక్స్‌గ్రేషియా కోసం ఎదురుచూపులు

- తాటి చెట్లు, ఈత చెట్లపై నుంచి పడి నలుగురు గీత కార్మికుల మృతి
- తీవ్రంగా గాయపడ్డ 24 మంది
- ప్రభుత్వం ఆదుకోవాలంటున్న బాధితుల కుటుంబసభ్యులు



కరీంనగర్ అర్బన్, ఆగస్టు 29: ఈత, తాటి చెట్లపై నుంచి కింద పడి మృతి చెందిన, గాయాలపాలైన గీత కార్మికుల కుటుంబాలు ఎక్స్‌గ్రేషియా కోసం ఎదురు చూస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో వృత్తినే జీవనాధారంగా చేసుకుని బతుకును వెళ్లదీస్తున్న గీత కార్మికులు ప్రమాదాల బారినపడి మృతి చెందుతున్నారు. మరికొన్ని సందర్భాల్లో తీవ్ర గాయాలతో వృత్తిని కొనసాగించలేకపోతున్నారు. కుటుంబ పెద్ద మరణించడం, తీవ్ర గాయాలపాలవడంతో ఆ కుటుంబం ఉపాధిని కోల్పోతున్నది. ఇటువంటి సందర్భాల్లో గీత కార్మికులను ఆదుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఎక్సైజ్‌శాఖ ద్వారా ఎక్స్‌గ్రేషియా అందిస్తున్నది. జిల్లాలో ఐదు నెలల కాలంగా గీత కార్మికులకు ఎక్స్‌గ్రేషియా అందక ఆయా కుటుంబాలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. గత సంవత్సరంనలుగురు గీత కార్మికులు మృతి చెందారు. 16 మంది శాశ్వత అంగవైకల్యం, తొమ్మిది మంది తాత్కాలిక అంగవైకల్యం బారినపడ్డారు. వీరికి ప్రభుత్వం 1.9 కోట్ల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించింది. ఈ సంవత్సరం ఇప్పటి వరకు నలుగురు మృతి చెందారు. 14 మంది గీతకార్మికులు శాశ్వత అంగ వైకల్యం పొందారు. మరో 11 మందికి గాయాలయ్యాయి. మొత్తం 28 మంది గీత కార్మికులు ఎక్స్‌గ్రేషియా కోసం ఎదురు చూస్తున్నారు. మృతి చెందిన కుటుంబాలతోపాటు శాశ్వత అంగవైకల్యం పొందినవారికి ప్రభుత్వం ఐదు లక్షల రూపాయలు, స్వల్పంగా గాయపడ్డవారికి 10 వేల రూపాయల ఎక్స్‌గ్రేషియా అందిస్తున్నది. సకాలంలో పరిహారం అందకపోవడంతో బాధిత కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాయి.

● శాశ్వత అంగవైకల్యం ధ్రువీకరణకు మెడికల్ బోర్డు సర్టిఫికెట్ తప్పనిసరి

గీత కార్మికుడు తాటి, ఈత చెట్టుపై నుంచి పడి శాశ్వతంగా అంగవైకల్యం పొందినట్లు వచ్చిన దరఖాస్తులను జిల్లా మెడికల్ బోర్డుకు పంపిస్తారు. జిల్లా మెడికల్ బోర్డులో ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి సివిల్ సర్జన్ బోర్డు చైర్మన్‌గా వ్యవహరిస్తారు. సభ్యులుగా ఆసుపత్రి సూపరింటెండెంట్, మరో సీనియర్ డాక్టర్ ఉంటారు. ఈ కమిటీ దరఖాస్తుదారుడిని పిలిపించి అతడికి వైద్య పరీక్షలు నిర్వహించిన తరువాత సర్టిఫికెట్‌ను జారీ చేస్తారు. మృతులకు సంబంధించి ఎఫ్ఐఆర్ కాపీతోపాటు పోస్టుమార్టం రిపోర్ట్, పంచనామా రిపోర్ట్‌లను దరఖాస్తుతో అందించాల్సి ఉంటుంది. స్వల్పంగా గాయపడ్డవారు సివిల్ సర్జన్‌తో సర్టిఫికెట్‌ను అందించాలి. శాశ్వత అంగవైకల్యం పొందిన వారికి మెడికల్ బోర్డు నిబంధనను సడలించాలని గీతకార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. స్వల్పంగా గాయపడ్డవారికి ఎక్స్‌గ్రేషియాను పెంచాలని గీత కార్మికులు కోరుతున్నారు.

బడ్జెట్ విడుదల కాగానే ఎక్స్‌గ్రేషియా అందిస్తాం

- పి శ్రీనివాసరావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్

2023-24 ఆర్థిక సంవత్సరంలో ప్రమాదవశాత్తు మరణించి, తీవ్రంగా గాయపడిన గీత కార్మికుల కుటుంబాలకు 1.9 కోట్ల రూపాయల ఎక్స్‌గ్రేషియాను అందజేశాము. 2024-25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌ను ప్రభుత్వం ఇంకా మంజూరు చేయలేదు. ప్రభుత్వం నుంచి బడ్జెట్ విడుదల కాగానే బాధిత కుటుంబాల ఖాతాల్లో ఎక్స్‌గ్రేషియా డబ్బులు జమచేస్తాం.

విద్యుత్ చౌర్యం కేసులో ఒకరికి జైలుశిక్ష

కరీంనగర్ క్రైం, ఆగస్టు 29: విద్యుత్‌ను చౌర్యం చేస్తూ ట్రాన్స్‌కో విజి లెన్స్ పోలీసులకు పట్టుబడిన కేసులో పెద్దపల్లి జిల్లా అంతర్గాం మం డలం పెద్దంపేట గ్రామానికి చెందిన కాంపెల్లి శంకర్‌కు పెద్దపల్లి జిల్లా సెషన్స్ కోర్టు 14,749 రూపాయల జరిమానా లేదా 3 నెలల సాధారణ జైలు శిక్షను విధించినట్లు కరీంనగర్ ట్రాన్స్‌కో విజిలె న్స్ సీఐ ఎండీ షాదుల్లాబాబా తెలిపారు. ప్రజలు విద్యుత్ చౌర్యానికి పాల్పడవద్దని ఆయన కోరారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య


నవీన్(ఫైల్)

వేములవాడ రూరల్, ఆగస్టు 29: మండలంలోని హన్మాజీపేట గ్రామంలో ఓ యువకుడు గురువారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. హన్మాజీపేట గ్రామానికి చెందిన వికృతి నవీన్(27) అనే యువకుడు పెళ్లి సం బంధాలు కుదరడం లేదని మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. ఒక్కగా నొక్క కొడుకు మృతి చెందడంతో తండ్రి శేఖర్, తల్లి లక్ష్మిలు బోరున విలపించారు. పోలీసులు కేసు నమో దు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మూడు రోజుల్లో 13 ఆవులు మృతి


మృతి చెందిన ఆవులు

తిమ్మాపూర్, ఆగస్టు 29: ఇటీవల పట్టుకున్న ఆవుల్లో మూడు రోజు ల్లోనే 13 మృతి చెందాయి. కొందరు అక్రమంగా తరలిస్తుండగా మం గళవారం 48 ఆవులను, బుధవారం 24ఎద్దులు, 4 ఆవులను ఎల్ఎండీ పోలీసులు వాహనాల తనిఖీల్లో పట్టుకున్నారు. పట్టుకు న్న పశువులను ఎల్ఎండీ కాలనీలో గల గిరిజా గోశాల ప్రాంగణానికి తరలించారు. ప ట్టుబడ్డ ఆవుల్లో అస్వస్థతకు గురై మంగళవారం 6, బుధవారం 4 ఆవులు మృత్యువాత పడ్డాయి. గోశాల సమీపంలోకి తరలించిన అధికారులు మాత్రం వాటి సంరక్షణను నిర్లక్ష్యం చేయడంతో గురువారం కూడా మరో 3 ఆవులు మృతి చెందాయి. మంగళవారం పట్టుకున్న ఆవులకు పశువైద్యా శాఖ అధికారులు, సిబ్బంది చికిత్స అందించారు. గోశాలకు తరలించిన ఆవులను పట్టించు కోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. పట్టుకున్న పశువులకు మేత వేయడం, నీటిని అందించడం, చికిత్స అందించడంలో నిర్లక్ష్యం కారణంగానే మృతి చెందాయని చెబుతున్నారు. జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి శంకర్, మండల వైద్యాధికారి మౌనిక, సిబ్బంది గురువారం గోవులను పరిశీలించి వాటిని చికిత్స అందించారు.

మద్యం మత్తులో గొంతు కోసుకున్న యువకుడు


గొంతు కోసుకున్న ఖాజా

వేములవాడ, ఆగస్టు 29: మద్యం మత్తులో ఓ యువకుడు గొంతు కోసుకున్న సంఘటన గురువారం వేములవాడలో జరి గింది. స్థానిక జగిత్యాల బస్టాండ్ ప్రాం తంలో నివాసం ఉంటున్న మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఖాజా అనే యువకుడు మద్యం మత్తులో బీరు సీసాతో గొంతు కోసుకున్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. బ్లూకోల్ట్స్ పోలీ సులు వెంటనే అక్కడకు చేరుకొని కాజాను 108లో తిప్పాపూర్‌లోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్య సేవల కోసం కరీంనగర్‌కు తరలించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు పోలీసులు ఆరా తీస్తున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత


స్వాధీనం చేసుకున్న బియ్యం

ముస్తాబాద్, ఆగస్టు 29: అక్రమంగా తరలిస్తున్న 26 క్వింటాళ్ల రేషన్ బియ్యంను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ముస్తాబాద్ మండలం నామాపూర్ వద్ద బియ్యాన్ని తరలిస్తున్నారనే సమాచారం మేరకు తనిఖీలు చేపట్టగా అక్రమంగా మూడు ఆటోల్లో తరలిస్తున్న 26 క్వింటాళ్ల రేషన్ బియ్యం ను స్వాధీనం చేసుకుని మూడు ఆటోలను సీజ్ చేసి, ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

ఆటోను ఢీకొట్టిన వ్యాన్

హుజూరాబాద్‌రూరల్, ఆగస్టు 29: మండల శివారులోని పెంచి కల్‌పేట సమీపం లోని అన్నదాత సీడ్స్ వద్ద కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారిపై ఆటోను వ్యాన్ ఢీకొట్టిన ఘటన గురువారం చోటు చేసు కుంది. వరంగల్ వైపు వెళ్తున్న ఓ ఆటోను వెనుక నుంచి డీసీఎం వ్యాన్ ఢీకొట్టడంతో పలువురికి గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న బీఆర్ఎస్ యువ నాయకుడు మెలుగు పూర్ణచందర్ తన వాహనాన్ని నిలిపి 108కు సమాచారం అందించి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు.

అదుపు తప్పి ఇంటి గోడను ఢీకొట్టిన కారు


ధ్వంసమైన కారు

హుజూరాబాద్‌రూరల్, ఆగస్టు 29: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఉన్న మూల మలుపు వద్ద బుధవారం అర్ధరాత్రి ఓ కారు అదుపు తప్పి ఇంటి గోడను ఢీకొట్టింది. అదు పు తప్పిన కారు వేగంగా వచ్చి కళా శాల పక్కన ఉన్న ఇంటి మెట్లను ఢీకొట్టి నిలిచిపో యింది. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. బ్లూకోల్ట్స్ పోలీ సులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలను నమోదు చేసుకు న్నారు. కారులో ప్రయాణిస్తున్న వ్యక్తులు మద్యం మత్తులో ఉండడం మూలం గానే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీ సులు భావిస్తున్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

- రూ.3 లక్షల విలువైన ఆభరణాలు అపహరణ

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 29: ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట గ్రా మంలో ఇంటికి తాళం వేసి ఉన్న రాణవేణి దర్గవ్వ ఇంటిలో గుర్తు తెలి యని వ్యక్తులు గురువారం చోరీకి పాల్పడారు. ఇంటి తాళం పగులకొట్టి లోనికి ప్రవేశించిన చోరులు బీరువా వద్ద ఉన్న తాళాలను తీసుకుని తెరి చారు. భద్ర పరిచిన రూ 3 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణా లతో పాటు రూ10 వేల నగదును అపహరించుకుపోయారు. తిమ్మాపూ ర్‌లోని దర్గవ్వ తన సమీప బంధువు ఇటీవల మృతి చెందడంతో మూడు రోజుల కిందట ఇంటి కి తాళం వేసి వెళ్లారు. గురువారం వచ్చి చూసే సరికి ఇంటి తాళం పగులకొట్టి కనిపించింది. స్థానిక పోలీసులకు సమాచారం అందించడంతో ఘటన స్థలానికి చేరుకున్నారు. వేలిముద్రల నిపుణులు నమూనాలను సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు..

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్ ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తి సామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)
శ్రీరాంసాగర్	7,534	4,375	80.5	59.766
ఎల్లంపల్లి	2,061	8,730	20.175	16.740
మిడ్ మానేరు	6,300	21,000	27.54	16.43
ఎల్ఎండీ	14.839	239	24.034	10.663

మున్సిపాలిటీలకు కమిషనర్లను నియమించండి

- సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ

జగిత్యాల అర్బన్, ఆగస్టు 29: రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాంలో నూ తనంగా ఏర్పడ్డ మున్సిపాలిటీలకు కమిషనర్లను నియమించాలని సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి గురువారం లేఖ రాశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన మున్సిపాలిటీలకు కమిష నర్‌ల పోస్టులను మంజూరు చేయకుండా కేవలం మేనేజర్, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ పోస్టులు మాత్రమే మంజూరు చేశారని తెలిపారు. దీంతో ప్రతి మున్సిపా లిటీలో కమిషనర్‌కు చెల్లించాల్సిన సాలరీ ము న్సిపల్ సాధారణ నిధుల నుంచి చెల్లించడంతో అరకొర నిధులు సమకూర్చు కునే మున్సిపాలిటీలపై ఆర్థిక భారం పడే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాంలో నూతనంగా ఏర్పాటు చేసిన మున్సిపాలిటీ లు రాష్ట్ర వ్యాప్తంగా 84 ఉన్నాయని అన్నారు. జగిత్యాల నియోజకవర్గంలోని రాయికల్ మున్సిపాలిటీలో సాధారణ నిధులు, కనీసం పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేసుకొనేందు కు కూడా నిధులు కొరత ఉన్న పరిస్థితుల్లో ప్రతి నెలా దాదాపు రూ.2లక్షలు కేవలం మున్సిపల్ కమిషనర్ వేతనం కోసం వెచ్చించడడం బాధాకరం అన్నారు. ఈ మేరకు 84 మున్సిపాలిటీలకు కమిషనర్ పోస్టుల మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు.

భూ కబ్జాలకు పాల్పడుతున్న ఒకరి అరెస్ట్


మాట్లాడుతున్న ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి

వేములవాడ, ఆగస్టు 29: భూ కబ్జాలకు పాల్ప డుతున్న ఒకరిని అరెస్టు చేసి రిమాండ్ తరలించా మని వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి తెలిపారు. గురువారం వేములవాడలో ఏర్పా టు చేసిన విలేకరుల సమావే శంలో ఆమె మాట్లాడు తూ జీవనోపాధి కోసం కొంతకాలంగా వేముల వాడలోని గాంధీనగర్‌లో నివాసం ఉంటున్న సాం ధారికారి వీణకు తన అత్తగారి ఊరైన జగిత్యాల జిల్లా కేంద్రంలోని మోచివాడలో ఇల్లు ఉంది. వీణ అత్తగారు ఇల్లును అమ్మడానికి ప్రయ త్నిస్తున్న తరుణంలో ఒటారికారి భూమేశ్ అనే వ్యక్తి తెలుసుకొని మాయమాటలు చెప్పి ఇంటిని తన పేరున రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని ఏఎస్పీ తెలిపారు. అనంతరం భూమేశ్ ఆ ఇల్లును 45 లక్షల రూపా యలకు ఇతరులకు అమ్మాడని తెలుసుకున్న వీణ డబ్బులు అడగగా చాలా రోజులు తిప్పించుకొని 20 లక్షలు మాత్రమే ఇచ్చాడని తెలిపారు. మిగతా డబ్బుల కోసం భూమేశ్‌ను అడుగుతున్నప్పటికీ తనకు రెండు లేదా మూడు లక్షలు ఇస్తేనే మిగతా డబ్బులు ఇస్తానని డిమాండ్ చేశా డని తెలిపారు. లేదంటే చంపుతానని కూడా బెదిరించారని పేర్కొన్నారు. వీణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు జరిపి భూమేశ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్ తరలించామని తెలిపారు. ఒటారికారి భూమేశ్ చేతిలో మోసపోయిన బాధితులు కరీంనగర్, సిరిసిల్ల, వేములవాడ పరిధిలో ఉన్నారని వారు నేరుగా సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

కోరుట్ల, ఆగస్టు 29: పట్టణంలోని పశువైద్య కళాశాల సమీపంలో జాతీ య రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీ వ్ర గాయాలయ్యాయి. కోరుట్ల పట్టణం నుంచి ఫిరోజ్, ఫిరోజ్ ఖాన్ అను పశు వైద్య కళాశాల విద్యార్థులు ద్విచక్ర వాహనంపై కళాశాలకు వెలుతు న్నారు. మెట్‌పల్లి మండలం కోనరావుపేట గ్రామానికి చెందిన ఎనుగు గం గారెడ్డి అనే వృద్ధుడు ద్విచక్రవాహనంపై కోరుట్లకు వస్తున్నాడు. పశువైద్య కళాశాల సమీపంలో ఉన్న రోడ్డు క్రాసింగ్ వద్ద రెండు వాహ నాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో గంగారెడ్డికి ఫిరోజ్‌కు గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించి క్షతగాత్రులను ప్రత్యేక వాహనం ద్వారా కోరుట్ల ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమం గా ఉండడంతో ఇద్దరిని మెరుగైన చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు తరలించినట్లు తెలిసింది. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఒకరిపై కేసు నమోదు

గంభీరావుపేట, ఆగస్టు 29: గంభీరావుపేటలో డీజే సౌండ్స్ పెట్టి ప్రజ లను ఇబ్బందికి గురిచేస్తున్న కామారెడ్డికి చెందిన గురిజాల చందుపై కేసు నమోదు చేసి అతని డీజే సిస్టం, ట్రాలీ ఆటోను సీజ్ చేసినట్లు ఎస్సై బి రామ్మోహన్ తెలిపారు. డీజే సౌండ్ సిస్టం ఎవరైనా పర్మిషన్ లేకుండా ఉపయోగించి ప్రజల కు ఇబ్బంది కలిగిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్సై రామ్మోహన్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడి మృతి

మల్లాపూర్, ఆగస్టు 29 : మండలంలోని మొగిలిపేట గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ పోతూరి శివరామకృష్ణ(30) మృతి చెందినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ గురువారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...మెట్‌పల్లి మండలంలోని సత్తక్కపల్లి గ్రామా నికి చెందిన పోతూరి శివరామకృష్ణ ద్విచక్ర వాహనంపై మండలంలోని ధారాజుపల్లికి వచ్చాడు. తిరిగి గ్రామానికి వెళ్తున్న క్రమంలో మొగిలి పేట గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న బస్సును తప్పించబోయి ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహ నం అదుపుతప్పి కిందపడ్డాడు. దీంతో శివరామకృష్ణ తీవ్ర గాయాలపా లయ్యాడు. చికిత్స కోసం నిజామాబాద్ ఆసపత్రికి తరలించగా చికిత్స పొం దుతూ గురువారం మృతి చెందినట్లు తెలిపారు. శివరామకృష్ణ తండ్రి పోతూరి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రూ.7,550 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, ఆగస్టు 29: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర .7,550 రూపాయలు పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు తొమ్మిది మంది రైతులు 94క్వింటాళ్ల విడి పత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,550, కనిష్ఠ ధర 6,900 రూపాయలు చెల్లించారు.

కారు షోరూంలో రూ.3.60 లక్షలు చోరీ

-మరో దాంట్లో దొంగతనానికి యత్నం

కరీంనగర్ క్రైం, ఆగస్టు 29: కరీంనగర్‌లో కారు షోరూంలను దొంగలు లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నారు. బుధవారం రాత్రి దొంగలు రెండు కారు షోరూంలలో చొరబడి ఒక షోరూంలో నగదును దొంగిలించుకుపోయారు. కోతిరాంపూర్‌లోని మాలిక్ కియా షోరూం వెనుక వైపున చిన్న తలుపునకు వేసిన తాళం పగులగొట్టిన దొంగలు లోపలికి చొరబడ్డారు. అనంతరం క్యాష్‌కౌంటర్ లాకర్‌లో భద్రపరిచిన 3 లక్షల 60 వేల రూపాయల నగదును ఎత్తుకుపోయారు. బుధవారం రాత్రి 8 గంటలకు నిర్వాహకులు క్యాష్‌కౌంటర్‌లో నగదు భద్రపరచి షోరూం మూసివేసి ఇళ్లకు వెళ్లారు. షోరూం సెక్యూరిటీ సిబ్బంది గురువారం ఉదయం తాళాలు తెరచి లోపలికి వెళ్ళగా వెనుక డోర్ తెరచి ఉంది. దీంతో షోరూం అసిస్టెంట్ జనరల్ మేనేజర్ డీకొండ శ్రావణ్‌కు సమాచారం అందించారు. వెంటనే షోరూం నిర్వాహకులు వచ్చి చూసే సరికి క్యాష్‌కౌంటర్‌లోని నగదు కనపడలేదు. ఈ మేరకు కరీంనగర్ ఒకటో ఠాణా పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వేలి ముద్రలు, ఇతర ఆధారాలను సేకరించి సీసీ కెమెరాలను పరిశీలించి విచారణ జరుపుతున్నారు. కాగా కియాకారు షోరూ పక్కనే ఉన్న గ్రీన్‌హోండా షోరూంలో కూడా దొంగలు చోరీకి ప్రయత్నం చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రౌడీ షీటర్లు సత్‌ప్రవర్తనతో నడుచుకోవాలి

- సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్


రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

వేములవాడ, ఆగస్టు 29: రౌడీ షీటర్లు సత్ ప్రవర్తనతో నడుచుకొని జీవితాలను సరిదిద్దుకోవాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. గురువారం వేములవాడ పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవ రణలో వేములవాడ పట్టణ పోలీస్‌స్టేషన్, వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్, బోయినపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు నేరాలలో నింది తులుగా ఉండి రౌడీషీట్లు, హిస్టరీ షీట్లు ఉన్న వారికి ఎస్పీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ నేరాల్లో నిందితులుగా ఉండి షీట్లు తెరువబడిన నేరచరితులు విధిగా పోలీసు అధికారులు తెలిపిన సమయాల్లో పోలీస్ స్టేషన్‌లో హాజరు కావాలని, హాజరుకాని పక్షంలో వారిని బైండోవర్ చేస్తామన్నారు. రౌడీ, హిస్టరీ షీట్స్ ఉన్నవారిపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని, ప్రజలను భయభ్రాం తులకు గురి చేస్తూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నేరాలకు దూరంగా ఉండటంతో పాటు సత్ప్రవర్తనతో మెదులుతున్న వారిని గుర్తించి వారిపై ఉన్న షీట్స్‌ను తొలగించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో గంజాయి నియంత్రణకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టామని, గంజాయి అరికట్టేందుకు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని, జిల్లాలో గంజాయి పరీక్షలు నిర్వహించేందుకు అవస రమైన కిట్లు అందుబాటులో ఉన్నాయని, డ్రంక్ డ్రైవ్ తరహాలో గంజాయి కిట్లతో తనిఖీలు చేస్తున్నామని, గంజాయి పాజిటివ్ వచ్చిన వారి నుంచి సరఫరా దారులను పట్టుకుంటున్నామని తెలిపారు. అనంతరం పట్టణ పోలీస్ స్టేషన్లో పలు రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, సిఐలు వీరప్రసాద్, శ్రీనివాస్, ఎస్ఐలు మారుతి, పృథ్వీందర్ గౌడ్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

లోన్ యాప్ వేధింపులు..

యువకుడి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, ఆగస్టు 29: లోన్ యాప్ వేధింపులతో కరీంనగర్ జిల్లా కేంద్రంలోని పోచమ్మవాడకు చెందిన గూడ సతీష్‌రెడ్డి(43) గురువారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నా డని కరీంనగర్ రెండో ఠాణా పోలీసులు తెలిపారు. మృతుడి భార్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు వివరాల ప్రకారం సతీష్‌రెడ్డి 10 సంవత్సరాల నుంచి కార్లకు బ్యాంక్ రుణాలను ఇప్పిస్తూ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. నగరంలోని జ్యోతినగర్‌లో కార్యాలయం ఏర్పాటు చేసి అక్కడి నుంచి కార్లకు వివిధ బ్యాంక్‌ల నుంచి రుణాలు ఇప్పిస్తుండేవాడు. లోన్ యాప్‌ల ద్వారా సతీష్‌రెడ్డి వ్యక్తిగతంగా కొంత రుణం తీసుకున్నాడు. సతీష్‌రెడ్డి ద్వారా కొందరు బ్యాంక్‌లలో రుణాలు తీసుకున్న కస్టమర్లు బ్యాంక్‌లకు ఈఎంఐలు చెల్లించడం లేదు. మరో వైపు లోన్‌యాప్‌లో రుణ భారం ఎక్కువైంది. ఇటీవల లోన్‌యాప్‌ల నిర్వాహకులు తీసుకున్న డబ్బులు చెల్లించాలని వేధించారు. దీంతో మనస్తాపం చెందిన సతీష్‌రెడ్డి గురువారం ఉదయం తన కార్యాలయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం సతీష్‌రెడ్డిని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు వెల్లడించారు. సతీష్‌రెడ్డి భార్య ఆమని ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

● పెద్దపల్లి జిల్లాలో యువకుడి ఆత్మహత్యాయత్నం

కాల్వ శ్రీరాంపూర్/ఓదెల: పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ గ్రామానికి చెందిన తుండ్ల శ్రీనివాస్ (27) అనే యువకుడు లోన్ యాప్ వేధింపులు భరించలేక బుధవారం అర్ధరాత్రి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కాల్వశ్రీరాంపూర్ గ్రామానికి చెందిన తుండ్ల శ్రీనివాస్ ఫైనాన్స్, క్రెడిట్ కార్డ్, రెండు లోన్‌యాప్స్‌లో సుమారు 4,80,000 వరకు డబ్బులు తీసుకున్నాడు. డబ్బులు కట్టాలని మనీ యాప్‌వారు, ఫైనాన్స్ వారు వేధించడంతో డబ్బులు కట్టలేక మనోవేదనకు గురయ్యాడు. దీంతో బుధవారం అర్ధరాత్రి ఇంట్లో నుంచి బయలుదేరి ఓదెల మండలం కొలనూరు రైల్వే స్టేషన్ ఆవరణలో పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యా యత్నానికి ప్రయత్నించాడు. స్థానికులు గమనించి కరీంనగర్‌కు తరలించారు. ప్రస్తుతం శ్రీనివాస్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మనీ యాప్స్, ఫైనాన్స్ వేధింపుల వల్లనే శ్రీనివాస్ ఆత్మహత్యా యత్నానికి పాల్పడినట్టు అతడి అన్నయ్య రాజు తెలిపారు.

గుడుంబా స్థావరాలపై ఆకస్మిక దాడులు


వీర్నపల్లిలో బెల్లం పానకాన్ని పారబోయిసస్తున్న సీఐ శ్రీనివాస్ గౌడ్

సిరిసిల్ల క్రైం, అగస్టు 29: రాజన్న సిరిసిల్ల జిల్లాలో అక్రమ గుడుంబా స్థావరాలపై గురువారం పోలీసులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాలలో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఏకకాలంలో దాడులు నిర్వహించిన పోలీసులు 27 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నారు. 133 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసారు. జిల్లా వ్యాప్తంగా ఒకే రోజు 19 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ అఖిల్ మహా జన్ తెలిపారు. గుడుంబా తయారీ పట్ల కఠినంగా వ్యవహ రిస్తామని ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు.

వీర్నపల్లి: గుడుంబా రహిత జిల్లాగా చేయాలనే లక్ష్యంతో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు గురువారం తెల్లవారుజామున వీర్నపల్లి మండల పోలీస్ స్టేషన్ పరిధిలోని రంగంపేట తండా గుడుంబా స్థావరాలపై సీఐ శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. దాడుల్లో 35 లీటర్ల బెల్లం పానకం, మూడు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని గుడుంబా స్థావరాలను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఎవరైనా అక్రమంగా గుడుంబా తయారుచేసిన, అమ్మిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాటుసారా తయారు చేస్తు న్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

చీటింగ్‌కి పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 28: చీటింగ్ కేసులో సిరిసిల్ల పట్టణం పెద్దూరు గ్రామానికి చెందిన తుమ్మ విజయ్ కుమార్ (28)అనే వ్యక్తిని గురువారం అరెస్ట్ చేశామని టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. సిరిసిల్లలోని సాయినగర్‌కు చెందిన బుట్టం పద్మకు సంబంధించిన భూమిలో బోరు వేసేందుకు డబ్బులు తీసుకుని మోసం చేసినట్లు తెలిపారు. ఆ డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగితే వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెడతానని, చంపుతానంటూ బెదిరించాడన్నారు. డబ్బులు వసూలు చేసిన తుమ్మ విజయ్‌పై పద్మ సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందన్నారు. ఈ మేరకు విజయ్‌పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. పెద్దూర్‌కి చెందిన తుమ్మ విజయ్ అనే వ్యక్తి ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని తనకు ప్రభుత్వ అధికారులు తెలుసని ఏవైనా పనులు ఉంటే చేసి పెడుతా అని నమ్మించి ప్రజలను నమ్మించి డబ్బులు తీసుకొని మోసం చేస్తున్నట్లు తెలిపారు. డబ్బులు అడిగితే ఎస్సీ, ఎస్టీ కేసు పెడతామని, చంపుతానని బెదిరింపులకు పాల్పడుతూ బలవంతంగా డబ్బులు తీసుకుంటున్నాడని, ఎవరైనా బాధితులు ఉంటే సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సీఐ కృష్ణ సూచించారు. చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఇద్దరిని గాయపర్చిన కుక్కలు


గాయపడిన బాలుడు

కొడిమ్యాల, ఆగస్టు 29: మండల కేంద్రానికి చెందిన సుల్తాన్ అనే రెండేళ్ల బాలుడి పై కుక్కలు గురువారం దాడి చేసి గాయపరిచాయి. బాలుడు ఇంటి వద్ద ఆడుకుం టుండగా కుక్క దాడి చేసి కుడి చేతిపై గాయపరిచింది. అలాగే చెప్యాల గ్రామానికి చెందిన ఒక మహిళ కొడిమ్యాల గ్రామానికి రాగా ఆమెను మరో కుక్క దాడి చేసి గాయపరిచింది. దీంతో వారు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు. గ్రామం లో కుక్కలు దాడి చేసి గాయపర్చడంతో ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

వైభవంగా సామూహిక లక్ష బిల్వార్చన

ఓదెల, ఆగస్టు 29: పెద్దపల్లి జిల్లాలోని శైవక్షేత్రమైన భ్రమరాంబ మల్లికార్జునస్వామి క్షేత్రంలో గురువారం సామూహిక లక్ష బిల్వార్చన వైభవంగా నిర్వహించారు. అర్చకులు అభిషేకాన్ని నిర్వహించిన అనం తరం హోమం నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు హాజరై బిల్వపత్రిని సమర్పించి మొక్కులు చెల్లించారు. అలాగే ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు ఆలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మకర్తలు అరెల్లి మొండయ్య, బత్తుల రమేష్, మాజీ ఆలయ కమిటీ చైర్మన్ ఆళ్ల రాజిరెడ్డి, మ్యాడగోన శ్రీకాంత్, చింతం మొ గిలి, కర్రె కుమార్, రాపర్తి మల్లేశం, చింతం వెంకటస్వామి పాల్గొన్నారు.


ఆలయంలో అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

పూడ్చిపెట్టిన మృతదేహానికి పోస్టుమార్టం


పూడ్చిపెట్టిన మృతదేహాన్ని వెలికితీస్తున్న అధికారులు

మానకొండూర్, ఆగస్టు 29: కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం లోని వెల్ది గ్రామంలో గురు వారం రాత్రి పాతిపెట్టిన మృతదేహాన్ని వెలికితీసి వై ద్యులు పోస్టుమార్టం నిర్వ హించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వెల్ది గ్రామానికి చెందిన చందుపట్ల హర్షవర్ధన్‌రెడ్డి-ప్రత్యూషలు హైదరాబాద్ లో నివసిస్తున్నారు వీరికి 35 రోజుల క్రితం నెలలు నిండని పాప జన్మించింది. ఆ పా ప అనారోగ్యానికి గురి కాగా పలు ఆసుపత్రులలో చికిత్స చేయించారు. ఆ చిన్నారి బుధవారం మృతి చెంది. మృతదేహాన్ని స్వగ్రామమైన వెల్దికి తీసుకవచ్చి రాత్రి 11. 30గంటలకు రైతులు పొలాలకు వెల్లే దారి ప్రక్కన పూడ్చిపెట్టారు. గురువారం మృత దేహం పూడ్చి పెట్టిన విషయం గ్రామంలో వ్యాపించగా అనుమానం రావడంతో గ్రా మ కారోబార్ మాశం మహేందర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక తహసీల్దార్ రాజేశ్వరీ, సీఐ సదన్‌కుమార్, వైద్యులు గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు. పూడ్చిపె ట్టిన మృతదేహాన్ని వెలికితీసి అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు.

పాము కాటుకు ఆవు మృతి

ఓదెల, ఆగస్టు 29: మండలంలోని గుండ్లపల్లి అనుబం ద గ్రామం కనికాడిపల్లిలో గురువారం కొట్టే ప్రభాకర్ అనే రైతుకు చెందిన ఆవు పాము కాటుకు గురై మృతి చెందింది. తన ఇంటి సమీపంలో ఆవును కట్టేసి ఉండగా చెత్తలో నుంచి వచ్చిన విష సర్పం కాటు వేయడంతో అ స్వస్థతకు గురైందని, చికిత్స కోసం సంబంధిత అధికారు లకు తెలిపిన కూడా స్పందించలేదని రైతు తెలిపారు. పాలు ఇచ్చే ఆవు మృతి చెందడంతో లక్ష రూపాయల నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.

వినియోగదారులకు నాణ్యమైన

విద్యుత్ సరఫరాకు చర్యలు

- టీఎస్ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ గంగాధర్

గణేశ్‌నగర్, ఆగస్టు 29: అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానంతో వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటున్నట్లు కరీంనగర్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ వడ్లకొండ గంగాధర్ తెలిపారు. గురువారం ఆయన అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ప్రతి పనిలో అధునాతన సాంకేతిక పద్ధతులు అవలంబిస్తున్నామని అన్నారు. వినియోగదారుల పనులు ఆలస్యం కాకుండా ఈ -స్టోర్ విధానాన్ని ప్రవేశపెట్టామని, దీనిలో మొత్తం ఆన్‌లైన్‌లో జరుగుతుందన్నారు. అందువల్ల క్షేత్ర సిబ్బంది సమయం ఆదా అవుతుందని, త్వరితగతిన పనులు పూర్తి అవుతున్నాయని వివరించారు. బిల్లింగ్, కలెక్షన్, అంతరాయాలు, ఫిర్యాదుల వివరాలు కమాండ్ కంట్రోల్ లాగా ఒకటే చోట ప్రతి ఒక్కపూర్తి సమాచారాన్ని తెలుసుకొనే వీలుంటుందని ఆయన తెలిపారు. ఎక్కడైనా సమస్య ఉత్పన్నమైతే వెంటనే ఆ పోల్ నంబర్ ద్వారా లొకేషన్ మ్యాపింగ్ తెలుసుకొని వెంటనే సిబ్బంది అక్కడికి వెళ్లి సమస్యను త్వరితగతిన పరిష్కరించవచ్చని అన్నారు. దీని ద్వారా అంతరాయాల సమయాన్ని గణనీయంగా తగ్గించవచ్చని ఎస్ఈ తెలిపారు.

బోధనేతర సిబ్బంది సమస్యలను పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న బోధనేతర సిబ్బంది

గణేశ్‌నగర్, ఆగస్టు 29: శాతవాహన విశ్వవిద్యాలయంలోని బోధనేతర సిబ్బంది తమ డిమాండ్ల సాధనకు గురువారం ఎస్‌యూ పరిపాలన విభాగం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్‌ను అమలు చేయాలన్నారు. పాలక మండలిలో బోధనేతర సిబ్బందికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఈహెచ్ఎస్‌ను అమలుపర్చాలని కోరారు. అనంతరం విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బోధనేతర సిబ్బంది సంఘం అధ్యక్షుడు వై.కిషోర్, పి.ప్రసాద్, భీమయ్య, టి.రాజేశ్వరి, నర్సయ్య, ఫసియుద్దీన్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల అధ్యక్షులు సంతోష్, మారుతి, శ్రీకాంత్, జగన్, మాధురి, శేఖర్ పాల్గొన్నారు.

కళాశాలల్లో మధ్యాహ్న భోజనం ఎప్పుడు..?

▸▸ పెరుగుతున్న డ్రాపౌట్స్

▸▸ ఆకలితో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



కథలాపూర్ జూనియర్ కళాశాల

కథలాపూర్, ఆగస్టు 29: మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జూని యర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న ఓ విద్యార్థిని సుమారు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న మారుమూల తుర్తి గ్రామం నుంచి ప్రతీదినం వస్తుంది. అక్కడి నుంచి ఉదయం ఏడు గంటలకు ఒకే ఒక బస్సు ఉండడంతో ఉరుకులు పరుగుల మీద కళాశాలకు చేరుకుని పాఠాలు వినాల్సి ఉంటుంది. సాయంత్రం నాలుగు గంటల దాకా భోజనం లేకుండానే నీరసం వచ్చినా పాఠాలపైనే శ్రద్ధ పెట్టాల్సిన పరిస్థితి. ఇది కళాశాలలో చదువుతున్న ఆ విద్యార్థిని సమస్యే కాదు సుమారు 400 మంది ఎదుర్కొంటున్న ఇబ్బందికరమైన దుస్థితి. ఇంటి నుంచి భోజనం తెచ్చుకోలేక, కళాశాలలో మధ్యాహ్న భోజనం లేక ఆకలితో అలమటించాల్సిన దైన్య స్థితి.

● దూర ప్రాంతాల నుంచి..

ప్రభుత్వ జూనియర్ కళాశాలకు మండలంలోని వివిధ గ్రామాల విద్యార్థులు చదువుకునేందుకు బస్సులు, ఆటోల్లో వస్తుంటారు. కళాశాలలో తరగతులు ఉదయం 9 గంటలకే ప్రారంభమవుతున్న నేపథ్యంలో హడావుడిగా విద్యార్థులు చేరుకుంటారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు ఇళ్ల నుంచి ఉదయం 7 గంటలకే లేచి కనీసం ఇళ్ల వద్ద అల్పాహారం కూడా చేయకుండా వస్తుంటారు. సాయంత్రం దాకా భోజనం లేని కారణంగా నీరసంతో పాఠాలు వినలేని పరిస్థితి ఎదురవు తోంది. ఈ కారణంగా కొందరు విద్యార్థులు కళాశాల చదువులను అర్థాంతరంగానే మానేస్తున్నారు. ఈ క్రమంలో ఏటేటా డ్రాపవుట్స్ పెరిగి పోయి విద్యార్థుల సంఖ్య తగ్గిపోతోందని అధ్యాపకులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం కళాశాలలో 400 మంది విద్యార్థులు చదువు తుండగా ప్రతీదినం వంద మంది విద్యార్థులు గైర్హాజరవుతున్నారు. గత బీఆర్ఎస్ సర్కారు 2018లో ఈ సమస్యను అధిగమించడానికిగాను కళాశాలల్లోనూ పాఠశాలల్లో మాదిరిగా మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తామని ప్రకటించినప్పటికీ హామీని అమలు చేయలేదు. ఓ స్వచ్ఛంద సంస్థతో ఒప్పందం కుదుర్చుకుని భోజనం పెట్టాలని ప్రతిపాదించినా హామీ నెరవేరలేదు. కనీసం కొత్తగా కొలువైన సర్కారు మధ్యాహ్న భోజనం అమలు చేస్తుందనే ఆశతో విద్యార్థులు నిరీక్షిస్తున్నారు.



హోటల్‌లో భోజనం చేస్తున్నా..

నిజామాబాద్ జిల్లా కమ్మరిపల్లి మండలం కోనాపూర్ నుంచి కళాశాలలో చదువుకునేం దుకు వస్తున్నా. ఏడు గంటలకు తప్పితే మరో బస్సు లేక పోవడంతో ఉదయం 9 గంటలకు కళాశాలకు చేరుకుంటున్నా. ఇంటి వద్ద భోజనం చేయలేని పరిస్థితి ఉన్నందు వల్ల కథలాపూర్‌లో హోటల్‌లో మధ్యాహ్నం భోజ నం చేసి కళాశాలలో తరగతులకు హాజరవు తున్నా.

- హరికృష్ణ, బైపీసీ ఫస్టియర్



దూర భారంతో అవస్థలు ..

ప్రతీదినం బస్సులో సుమారు 15 కిలో మీటర్ల దూరం ప్రయాణించి కళాశాలకు చేరుకుంటున్నా. ఆకలితో అలమటించి పాఠా లు వింటున్నా. చదువుకోవాలనే ఆసక్తి ఉండ డం వల్ల ఇబ్బందులు ఎదురవుతు న్నప్పటికీ కళాశాలకు వస్తున్నా. రాత్రికి ఇంటికి చేరు కున్నాకే భోజనం చేయాల్సి వస్తోంది. అధి కారులు, ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి.

- కోలకాని గంగోత్రి, తుర్తి



విద్యార్థినుల సంఖ్య తగ్గుతోంది..

ప్రభుత్వం కళాశాలల్లో మధ్యాహ్న భోజనం ప్రవేశ పెట్టి అమలు చేస్తే విద్యా ర్థులు డ్రాపవుట్స్ కావడానికి ఆస్కారం ఉండదు. భోజనం పెడితే విద్యార్థుల్లో శారీ రక, మానసిక శక్తి పెరుగుతుంది. ప్రధా నంగా కళాశాలలో విద్యార్థినుల సంఖ్య తగ్గుతోంది. సర్కారు భోజనం ఏర్పాట్లు చేస్తే మరింత మెరుగైన ఫలితాలు వస్తాయి.

- రాజేశ్, కెమిస్ట్రీ లెక్చరర్

వైభవంగా శ్రీసీతారామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ



ప్రతిష్ఠాపనకు ముస్తాబైన దేవతామూర్తులు

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 29: నగరంలోని శాతవాహన యూనివర్సిటీ సమీపంలో శ్రీరామనగర్ కాలనీలో ఆలయ కమిటీ, శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నెలకొల్పిన శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ విగ్రహాల ప్రతిష్ఠాపనలు గురువారం వైభవోపేతంగా కొనసాగాయి. వైదిక కార్యక్రమాలు, వేదపండితుడు, యజ్ఞాచార్యుడు గోవర్ధనగిరి జగన్నాథాచార్యుల బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్ష కార్యదర్శులు డి మాదవరావు, గజవాడ ఆంజనేయులు, కోశాధికారి ఎస్ నరసింహాచారి, సభ్యులు పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి షోడష కళాన్యాసము, దృష్టి కుంభము, అలంకారము, ప్రథమారాధన, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరుగనున్నాయి. ఉదయం 9 గంటలకు దంపతుల క్షేమం కోసం ప్రత్యేక హోమాలు నిర్వహించనున్నారు.

గడ్డి మందు తాగిన వ్యక్తిని కాపాడిన వైద్యులు

సుభాష్‌నగర్, ఆగస్టు 29: గడ్డిమందు అధిక మోతాదులో తాగిన వ్యక్తి ప్రాణాలను మెడికవర్ వైద్యులు కాపాడారు. గురువారం నగరంలోని ఆసుపత్రిలో విలేకరుల సమావేశంలో నెఫ్రాలజీ వైద్యులు డాక్టర్ తొర్రం రాంచందర్ వివరాలు తెలిపారు. జమ్మికుంటకు చెందిన 46 సంవత్సరాలు గల వ్యక్తి గడ్డిమందును తాగగా కుటుంబసభ్యులు మెడికవర్ ఆసుపత్రిలో చేర్పించారు. అప్పటికే అతని లివర్, కిడ్నీ, ఊపిరితిత్తులు దెబ్బతిన్నట్లు డాక్టర్లు గుర్తించారు. స్పెషల్ ఫిల్టర్ ద్వారా రక్తం నుంచి గడ్డిమందును పూర్తిగా తొలగించామని వైద్యులు తెలిపారు. గడ్డిమందు తాగిన వ్యక్తులను నాలుగు గంటల్లో ఆసుపత్రిలో చేర్పించినట్లైతే ప్రాణాలు కాపాడ వచ్చన్నారు. మెడికవర్‌లో అన్ని స్పెషాలిటీల వైద్యులు అందుబాటులో ఉండడం వల్లనే ఇది సాధ్యమైందన్నారు. ఈ సమావేశంలో ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, క్రిటికల్‌కేర్ నిపుణులు ఉపేందర్‌రెడ్డి, ఎమర్జెన్సీ హెచ్‌వోడి సత్యనారాయణ, మెడికల్ సూపరింటెండెంట్ రవి మల్లారెడ్డి పాల్గొన్నారు.

దుర్శేడ్‌లో వైద్య శిబిరం

కరీంనగర్ రూరల్, ఆగస్టు 29: కరీంనగర్ మండలం దుర్శేడ్ గ్రామంలో ఓ వ్యక్తికి డెంగ్యూ పాజిటివ్ నిర్ధారణ కాగా గురువారం మండల ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వైద్యులు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కరీంనగర్ మడల ఎంపీవో జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు దుర్శేడ్ హెల్త్ సెంటర్ నుండి డాక్టర్ శోభరాణి, శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపు నిర్వహించారు. 51మంది రక్తనమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం పంపించారు. ఈకార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ సుంకిశాల సంపత్ రావు, పంచాయతీ కార్యదర్శి సంజీవరెడ్డి, ఎఎన్ఎం పద్మ, ఆశ వర్కర్ అనిత, కారోబార్ మురళీ తదితరులు పాల్గొన్నారు.

'జాన్సన్ గ్లోబల్'లో విద్యార్థులకు ఎన్నికలు

కరీంనగర్‌టౌన్, ఆగస్టు 29: నగరంలోని జాన్సన్ పాఠశాల విద్యార్థులకు గురువారం ఎన్నికలు నిర్వహించారు. ఇందులో భాగంగా గెలుపొందిన విద్యార్థుల యొక్క ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రసాయనశాస్త్ర ప్రొఫెసర్, కెప్టెన్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ బుర్ర మధుసూదనరెడ్డి హాజరై పాఠశాల కెప్టెన్, కల్చరల్ కెప్టెన్ డిసిప్లైన్ కెప్టెన్ల ప్రమాణస్వీకారం చేయించారు. పాఠశాల చైర్మన్ మహిపాల్ రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, సింహాచలం హరిక్రిష్ణ, వంగళ సంతోష్ రెడ్డిలు మధుసూదన్ రెడ్డిని సత్కరించారు. తెలుగు భాషా దినోత్సవాన్ని, జాతీయ క్రీడా దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల. చైర్మన్, డైరెక్టర్లు స్పోర్ట్స్ లాంప్ వెలిగించి జెర్సీ టీ షర్ట్‌ని ఆవిష్కరించారు.

ఫీజుల దోపిడీపై విచారణ జరిపించాలి

సుభాష్‌నగర్, ఆగస్టు 29: విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడిపై ఈడీ, సీబీఐచే విచారణ జరిపించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌వి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న పాఠశాల ఎదుట దర్నా నిర్వహిస్తే విద్యార్థి సంఘాల నాయకు లపై అక్రమ కేసులు బనాయించడం సిగ్గుచేటన్నారు.

విద్యాశాఖ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న విద్యా సంస్థలపై విద్యాశాఖ అధికారి ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. అనుమతి లేని పాఠశాలను తక్షణమే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో దళిత లిబరేషన్ ఫ్రంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్వాడి సుదర్శన్, పీడీఎస్‌యూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రధానకార్యదర్శి కుతాటి రాణాప్రతాప్, జిల్లా ఉపాధ్యక్షుడు రవితేజ, అజ్జాన్, సమీర్, రోహిత్, ప్రీతం, సాద్విక్ పాల్గొన్నారు.

ఆలయ పునఃనిర్మాణ పనులు ప్రారంభం

గన్నేరువరం, ఆగస్టు 29: మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో పురాతన రంగనాయక స్వామి ఆలయ పునఃనిర్మాణ పనులను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి 50 లక్షల రూపాయల నిధులను మంజూరు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, నాయకులు బేతెల్లి రాజేందర్‌రెడ్డి, వంగల సత్యనారాయణ, కొమురయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు

తిమ్మాపూర్, ఆగస్టు 29: మండలంలోని మహాత్మానగర్ గ్రామం ఎల్ఎండీ కాలనీలో గల బజార్ ఏరియాలో అక్రమంగా, అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టినట్లు గుర్తించిన ఎస్సారెస్పీ అధికారులు గురువారం ఎక్సకావేటర్‌తో తొలగించారు. దీంతో బజారు ఏరియాకు చెందిన ప్రజలు అక్కడికి చేరుకొని కొంత సమయం ఇవ్వాలని, తాము ఇక్కడి నుంచి ఖాళీ చేసి వెళ్లిపోతామని కొందరు రాత పూర్వకంగా రాసి ఇవ్వడంతో అధికారుల వెనుతిరిగారు. ఈ విషయంపై క్యాంప్ ఈఈ నాగభూషణంను వివరణ కోరగా బజార్ ఏరియాకు సంబంధించి కోర్టులో కేసు ఉన్నందున ప్రస్తుతం ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దన్నారు. అది కోర్టు దిక్కరణ కిందికి వస్తుందని తెలిపారు. గతంలోనే నిర్మాణాలు చేపట్టవద్దని నోటిసులు కూడా జారీ చేశామని వివరించారు.

10 టీఎంసీలకు చేరిన నీటి మట్టం

తిమ్మాపూర్. ఆగస్టు29: కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయంలోకి 10 టీఎంసీల నీరు వచ్చి చేరింది. ఎంఎంఆర్ నుంచి ఎల్ఎండీలోకి నీటి విడుదల కొనసాగుతోంది. ఎల్ఎండీ పూర్తి స్థాయి నీటి మట్టం 24.034 టీఎంసీలు కాగా గురువారం సాయంత్రం 6గంటల సమయంలో 10.819 టీసీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎంఎంఆర్ నుంచి 14,600క్యూసెక్కులు, మోయతుమ్మెద వాగు ద్వారా 239 క్యూసెక్కులు మొత్తం 14,842క్యూసెక్కుల నీరు ఎల్ఎండీలోని ఇన్‌ఫ్లో చేరుతోంది. మిషన్ భగీరథ, ఆవిరి రూపంలో 242 క్యూసెక్కుల నీరు అవుట్ ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు వెల్లడించారు. ప్రతి రోజు ప్రస్తుతం ఒక టీఎంసీ నీరు ఎల్ఎండీలోకి వచ్చి చేరుతోంది.

కొనసాగుతున్న నీటి విడుదల

రామడుగు, ఆగస్టు 29: మండలంలోని లక్ష్మీపూర్ గాయత్రి పంప్‌హౌస్ నుంచి శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు జలాశయానికి నీటి విడుదల కొనసాగుతుంది. గురువారం మూడు పంపుల ద్వారా 9,450 క్యూసెక్కుల నీటిని ఎస్ఆర్ఆర్ డ్యామ్‌కు తరలించారు. ఇప్పటి వరకు గాయత్రి పంప్‌హౌస్ నుంచి రాజరాజేశ్వర జలాశయానికి 22 టీఎంసీల నీటిని తరలించినట్లు అధికారులు తెలిపారు.

ఏఎంసీ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం నేడు

మానకొండూర్, ఆగస్టు 29: మానకొండూర్ వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం శుక్రవారం మార్కెట్ కార్యాలయ ఆవరణలో నిర్వహించ నున్నారు. నాలుగేళ్లుగా మార్కెట్ కమిటీకి పాలకవర్గాన్ని ప్రకటించలేదు. కార్యక్రమానికి బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హాజరు కానున్నారు.

'కల్యాణలక్ష్మి' చెక్కుల పంపిణీ

సైదాపూర్, ఆగస్టు 29: మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం తహసీల్దార్ మంజుల 12 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్, సిబ్బంది పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఇల్లందకుంట, ఆగస్టు 29: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టాక్టర్లను పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. మానేరు వాగు పరివాహక ప్రాంతం నుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేశామని ఎస్సై రాజకుమార్ తెలిపారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం







క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, బిర్లా స్కూల్‌లో క్రీడల్లో పాల్గొన్న విద్యార్థినిలు, రావుస్ స్కూల్లో కబడ్డీ పోటీలు

భగత్‌నగర్, ఆగస్టు 29: కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో గురువారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఫుట్‌బాల్, వాలీబాల్, త్రోబాల్, కబడ్డీ, ఖోఖో, టెన్నికాయిట్, బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహించారు. వ్యాయామ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. విద్యార్థులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించగా క్రీడా జ్యోతిని వెలిగించారు.

●**కరీంనగర్ స్పోర్ట్స్:** భగత్‌నగర్‌లోని రావుస్ ఇంటర్నేషనల్ స్కూల్లో విద్యార్థులకు ఖోఖక్ష, కబడ్డీ ఆటల పోటీలు నిర్వహించారు. పాఠశాల చైర్మన్ ప్రభాకర్ రావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల సీఈఓ నితిన్‌రావు, ప్రిన్సిపాల్ రహమాన్ పాల్గొన్నారు. పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాలలో జాతీయ స్థాయిలో పాల్గొన్న క్రీడాకారులచే క్రీడా పరుగును నిర్వహిం చారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ప్రసాద్‌రావు, డైరెక్టర్లు ప్రసూన్‌రావు, రశ్మిత, అనుకరావు, రాకేష్, ప్రసాద్, రమణ, వినోద్‌రావు, హనుమంతరావు, పాల్గొన్నారు.

●**కరీంనగర్ రూరల్:** కరీంనగర్ మండలం బొమ్మకల్ గ్రామంలోని బిర్లా స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేశారు. అనంతరం క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

●నగునూర్ గ్రామంలోని తెలంగాణ సాంఘిక గురుకుల కళాశాలలో విద్యార్థినిలకు క్రీడలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. తెలుగు విభాగం తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సంజీవరావు కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.మాలతి పాల్గొన్నారు.

●**హుజూరాబాద్‌రూరల్:** యువత క్రీడలపై ఆసక్తిని పెంపొందించుకోవాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ అన్నారు. గురువారం మండలంలోని తుమ్మనపల్లి గ్రామ శివారులో ఏర్పాటు చేసిన స్టంప్స్ బాక్స్ క్రికెట్ కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఏసీపీ శ్రీనివాస్‌జీ, టౌన్ సీఐ తిరుమల్ పాల్గొన్నారు.

●**గంగాధర:** గంగాధరలో వివేకానంద విద్యాలయంలో క్రీడలు నిర్వహించారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గర్షకుర్తి జడ్పీ పాఠశాలలో పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు, అయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

●**తిమ్మాపూర్:** మన్నెంపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోహన్ రావు ఆధ్వర్యంలో 2కే రన్ నిర్వహించారు. ఎంపీడీవో విజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై 2కే రన్ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మేడి అంజయ్య పాల్గొన్నారు.

●**సైదాపూర్:** సైదాపూర్ మోడల్ స్కూల్‌లో క్రీడల్లో రాణించిన విద్యార్థులను మోడల్ స్కూల్ ఇన్‌చార్జి శిరీష అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు మురళి, స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ ఉయ్యాల విష్ణువర్ధన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●**చొప్పదండి:** చొప్పదండి జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పారామిత స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ప్రసూన స్పోర్ట్స్ షర్టులను అందజేశారు. అనంతరం వ్యాయామ ఉపాధ్యాయుడు చంద్రశేఖర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాజిరెడ్డి పాల్గొన్నారు.

విద్యారంగ అభివృద్ధిలో విద్యార్థి సంఘాల పాత్ర కీలకం

కరీంనగర్‌టౌన్, ఆగస్టు 29: భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్ఎఫ్ఐ) కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ నెల 12,13,14వ తేదీలు నిర్వహించే రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశాల పోస్టర్ ఆహ్వాన సంఘం అధ్యక్షులు అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి జూనియర్ కళాశాలలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో వస్తున్న మార్పులపై ప్రభుత్వాలకు విద్యాసంస్థల యజమాన్యాలతో చర్చించడంలో విద్యార్థి సంఘాల పాత్ర కీలకమైందని కొనియాడారు. విద్యారంగం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర చర్చలు జరిపి విద్యారంగా అభివృద్ధికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇతర దేశాల్లో అనుసరిస్తున్న విధానాలతో విద్యారంగ అభివృద్ధి కోసం భారతదేశము యొక్క పరిస్థితులకు అనుగుణంగా విద్యారంగాన్ని చర్చించి అభివృద్ధి పరచాలన్నారు. మారుతున్న సమాజానికి అనుగుణంగా విద్యారంగాన్ని మార్చాల్సిన అవసరం ఉందని తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణలో రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సంద గణేష్, రాహుల్, జిల్లా నాయకులు సంపత్, గణేష్, అరుణ్, నితిన్, గీతాంజలి, వంశీ, రమేష్, లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో క్రీడాకారులకు పతకాలు

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 29: కర్నాటక రాష్ట్రంలోని శివమొగ్గలో ఈ నెల 24, 25 తేదీల్లో నిర్వహించనున్న అంతర్జాతీయ కరాటే ఓపెన్ ఛాంపియన్ షిప్ పోటీల్లో కరీంనగర్‌కు చెందిన కాంటినెంటల్ కరాటే డో ఇండియా జాతీయ అకాడమి క్రీడాకారులు పాల్గొని ఆరు పతకాలను సాధించారు. ఈ పోటీల్లో అండర్-12 బాలుర విభాగంలో ఎం ప్రసన్న కటాలో బంగారు, కుమిటీలో కాంస్య పతకాలు వైశ్విక్ రామ్ కటాలో బంగారు కుమిటీలో కాంస్య శ్రేయాన్స్ కటాలో రజత పతకం అనాస్ కటాలో బంగారు పతకాలు సాధించారని సిఎస్‌కె ఇండియా చీఫ్ రాష్ట్ర కాయ్ అధ్యక్షుడు ఇ శ్రీనివాస్ తెలిపారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

సుభాష్‌నగర్, ఆగస్టు 29: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని జమాత్ ఇస్లామి హింద్ జిల్లా అధ్యక్షుడు సోహైబ్ అహ్మద్‌ఖాన్ అన్నారు. జమాత్ ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో ఈనెల 30నుంచి సెప్టెంబరు 13వరకు చెడు నిర్మూలన ఉద్యమం చేపట్టినట్లు ఆయన తెలిపారు. గురువారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాజంలో మద్యపానం, మాదకద్రవ్యాల వినియోగం, వడ్డీ వ్యాపారం, సైబర్ నేరాలు, మహిళలపై వేదింపులు, అత్యాచారం, హత్యలు అనేక అనైతిక సంఘటనల వల్ల చాలా మంది బాధపడుతున్నారని తెలిపారు. నేటి యువత ఇంటర్నేట్ వల్ల చెడు ప్రభావాలకు లోనవుతున్నారని అన్నారు. 14 రోజులపాటు ప్రజల్లో తిరిగడంతో పాటు పాఠశాలల సందర్శన, ప్రభుత్వ అధికారులతో సమావేశాలు, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, స్వచ్ఛంద సంస్థలతో సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఖైరుద్దీన్, ఈస్ట్ యూనిట్ అధ్యక్షుడు మహమ్మద్ అజరుద్దీన్‌ఖాన్, ఉపాధ్యక్షుడు మహమ్మద్ అలీసబీర్, కార్యదర్శి మహమ్మద్ నయీమ్ పాల్గొన్నారు.

రాజీవ్ రహదారిపై ఫ్లైయాష్ రవాణాతో ఇబ్బందులు

-దుమ్ముతో తరచుగా ప్రమాదాలు -పట్టించుకోని రోడ్డు సేఫ్టీ అధికారులు



రోడ్డుపై పడ్డ ఫ్లైయాష్‌తో లేచిన దుమ్ము

కరీంనగర్ రూరల్, ఆగస్టు 29: కరీంనగర్ బైపాస్ నుంచి గోదావరిఖని వెళ్లే రాజీవ్ రహ దారిపై ఫ్లై యాష్ రవాణాతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎన్టీపీసీ నుంచి ఫ్లై యాష్ తీసుకువెళ్తున్న వాహనాలనుంచి కింద పడ్డ బూడిద వల్ల తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఈరహదారి వెంబడి లారీల నుంచి పడ్డ బూడిదను ఎప్పటికప్పుడు తీసివేయాల్సి ఉండగా రోడ్డు సెప్టీ అధికారులు కానీ, సిబ్బంది కాని పట్టించుకోవడం లేదు. బారి వాహనాలు వెల్లె క్రమంలో బూడిద లేవడంతో వెనకాల ఉన్న వాహనాలకు కనిపించకుండా పోతున్నాయి. దీంతో ఇబ్బందులకు గురవుతున్నామని ఆయా గ్రామస్తులు, వాహనదారులు తెలిపారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకుని రోడ్డుపై పడ్డ బూడిదను ఎప్పటికప్పుడు తొలగించాలని కోరుతున్నారు.

తప్పుడు పత్రాలతో విరాసత్ ఫిర్యాదుపై ఆర్డీవో విచారణ



తహసీల్దార్ కార్యాలయంలో విచారణ చేపడుతున్న ఆర్డీవో రమేశ్‌బాబు

శంకరపట్నం, ఆగస్టు 29: తప్పుడు పత్రాలు సృష్టించి విరాసత్ చేశారనే ఫిర్యాదు మేరకు హుజూరాబాద్ ఆర్డీవో రమేశ్‌బాబు శంకరపట్నం తహసీల్దార్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఆర్డీవో తెలిపిన వివరాల ప్రకారం శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని నల్ల వెంకయ్యపల్లెకు చెందిన పొద్దుటూరి శంకరమ్మ కుమారుడు వీరారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. వీరారెడ్డికి సంబంధించిన ఆస్తిని జమున వారి కూతుళ్లకు తప్పుడు పత్రాలు సృష్టించి విరాసత్ చేశారని, ఆ విరాసత్ రద్దు చేయాలని అతడి తల్లి శంకరమ్మ, వారి కుటుంబ సభ్యులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కాగా ఆ ఫిర్యాదుపై ఆర్డీవో గురువారం జమున, వారి కూతుళ్లను విచారించారు. వివరాలు నమోదు చేసుకొని సంబంధిత పత్రాలు పరిశీలించారు. నివేదికను కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు ఆర్డీవో తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికులు కాటమయ్య రక్షణ కవచాన్ని ధరించాలి

రామడుగు, ఆగస్టు 29: గీత కార్మికులు కల్లు తీస్తున్న క్రమంలో తప్పనిసరిగా కాట మయ్య రక్షణ కవచాన్ని తప్పనిసరిగా ధరించాలని ఎక్సైజ్ సీఐ అశోక్‌కుమార్ అన్నారు. మండలంలోని గోపాల్‌రావుపేట, తిరుమలపూర్ గ్రామాల్లోని గీత కార్మికులకు గురువారం కాటమయ్య రక్షణ కవచంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు ఈ రక్షణ కవచం ఎంతగానో ఉపయోగపడు తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐలు లక్ష్మణ్, విజయభాస్కర్, సిబ్బంది భూమయ్య, అనిల్, గీత కార్మికులు పాల్గొన్నారు.

గన్నేరువరం: గీత కార్మికుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన కాటమ య్య రక్షణ కవచం (సేఫ్టీ మోకు కిట్) వినియోగంపై మండల కేంద్రంలో ఎక్సైజ్ ఎస్ఐ శ్రీకాంత్, బీసీ సంక్షేమ అధికారి అనిల్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గీతకార్మికులు కల్లు గీసే క్రమంలో చోటు చేసుకునే ప్రమాదాలను అరికట్టేందుకు కాటమయ్య రక్షణ కవచం(సేఫ్టీ మోకు) ఉపయోగించు విధానంపై రాక్ మౌంటేన్ క్లైంబింగ్‌లో నిష్ణాతులైన ట్రైనర్ జశ్వంత్ సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది నరేష్, కొండల్‌రెడ్డి, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల నిరసన

హుజూరాబాద్, ఆగస్టు 29: హుజూరాబాద్ పట్టణంలో యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చిత్రపటంపై లిక్కర్ పోసి గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ పేరు చెప్పుకోని పది సంవత్సరాలు అధికారం అనుభవించి కోట్లు కూడ బెట్టుకున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబం వెంటనే ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సందమల్ల నరేష్, టేకుల శ్రావణ్, మానస, నాగమణి, బండ నవీన్, జంగ అనిల్, వినోద్‌రెడ్డి, చల్లూరి విష్ణువర్ధన్, ముక్క రవితేజ, ప్రసాద్, నాగరాజు, అఖిల్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు ఆత్మీయ సమ్మేళనం కరపత్రం ఆవిష్కరణ

జమ్మికుంట, ఆగస్టు 29: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని శ్రీదుబ్బమ ల్లికార్జునస్వామి ఆలయం ఆవరణలో మున్నూరుకాపు ఆత్మీయ సమ్మేళనం కరపత్రా న్ని గురువారం మున్నూరుకాపు సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా పలువురు మాట్లాడుతూ మున్నూరుకాపు సమ్మేళనం, వన భోజనం కార్యక్ర మానికి ముఖ్యతిథిగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మాజీ మంత్రి గంగుల కమలాకర్ హాజరు కానున్నట్లు తెలిపారు. ఆత్మీయ సమ్మేళనానికి మున్నూరుకాపులు పెద్ద ఎత్తున తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పొనగంటి మల్లయ్య, పొనగంటి సంపత్, ఆకుల రాజయ్య, తోట లక్ష్మణ్, ఆకుల రాజేందర్, పురంశెట్టి చేరాలు, పుప్పాల రఘు, పొనగంటి రాము, పుప్పాల రాజారాం, ఏబూషి శ్రీనివాస్, దాట్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

హుజూరాబాద్, ఆగస్టు 29: విద్యార్థులు చదువులో రాణిస్తూనే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని పట్టణ సీఐ జి తిరుమలగౌడ్ అన్నారు. గురువారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకోని స్థానిక మాంటిస్సోరి పాఠశాల విద్యార్థులు అంబేద్కర్ చౌరస్తా నుండి 1కే రన్ చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పట్టణ సీఐ తిరుమలగౌడ్ హాజరయ్యారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వేముల గోవర్ధన్, ప్రిన్సిపాల్ గీతాషాజు, డైరెక్టర్ షాజు తామస్, గంద్ర సుధాకర్‌రెడ్డి, నూకల శ్రీనివాస్‌రావు, ఎస్సీ కార్పోరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, వ్యాయమ ఉపాధ్యాయులు రాజిరెడ్డి సొల్లు సారయ్య, వాకర్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు ఎమ్మెల్యేల పరామర్శ

తిమ్మాపూర్, ఆగస్టు 29: మండలంలోని కొత్తపల్లి మాజీ సర్పంచ్ ఇనుకొండ జితేందర్‌రెడ్డి తండ్రి ఇనుకొండ వెంకట్రాంరెడ్డి ఇటీవల మరణించగా బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, ఆడ్లూరి లక్ష్మణ్‌కుమార్ గురువారం ఇంటికి వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, నాయకులు పోలు రామ్, అషిక్ పాషా పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



రామ్మూర్తి చిత్రపటానికి పూల మాల వేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ బి రమేష్

జమ్మికుంట, ఆగస్టు29: జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి రమేశ్ ఆధ్వర్యంలో తెలుగు వ్యవహారిక భాషా దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. వ్యవహారిక భాషా అభివృద్ధికి కృషి చేసిన స్వర్గీయ గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూల మా లలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో తెలుగు విభాగం అధ్యాపకురాలు ఎమ్ శ్యామల, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ ఓదేలు కుమార్, అధ్యాపకులు డాక్టటర్ కె గణేష్, వి కిరణ్‌కుమార్, డాక్టర్ కె మాధవి, కె ఉమాకిరణ్, డాక్టర్ ఈ రవి, పి శ్రీనివాస్‌రెడ్డి, ఎల్ రవిందర్, డాక్టర్ పి సుష్మ, డాక్టర్ పి రవిప్రకాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

కరీంనగర్‌టౌన్, ఆగస్టు 29: మహిళలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. యూనిసెఫ్ ఆధ్వర్యంలో నగరంలోని స్వశక్తి కళాశాలలో గురువారం ఐసిడియస్, మెప్మా, ఐకెపి, వైద్య విద్య శాఖ సిబ్బందికి రుతుక్రమ పరిశుభ్రతపై శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ట్రైయినీ కలెక్టర్ అజయ్ యాదవ్, యునిసెఫ్ రిసోర్స్‌పర్సన్ డాక్టర్ శాంతి, నిర్వాహకులు కాశీనాథ్, ఆర్.సి.ఓ కిషన్‌స్వామి, రిసోర్స్ పర్సన్ అంజలి, కోచీఆర్డినేటర్లు రమేష్ వేణు, రవి, కల్యాణి పాల్గొన్నారు.

నేడు బండి సంజయ్‌కుమార్ పర్యటన

గన్నేరువరం, ఆగస్టు 29: మండలంలో శుక్రవారం కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ పర్యటించనున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు నగునూరు శంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గన్నేరువరం నుంచి మైలారం వరకు, బెజ్జంకి మండ లంలోని బేగంపేట వరకు 32 కోట్లతో చేపట్టే డబుల్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేయనున్నామని తెలిపారు.

'నిరసన ప్రదర్శనల్లో పాల్గొనాలి'

గన్నేరువరం, ఆగస్టు 29: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునుద్ధరించాలని టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రాల్లో ఆదివారం చేపట్టే నిరసన ప్రదర్శనల్లో నల్ల బ్యాడ్జీలు ధరించి ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొనాలని టీసీపీఎస్‌ఈఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మాండ్ల భాస్కర్ పిలుపునిచ్చారు. మండలంలోని గుండ్లపల్లిలో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడారు. సెప్టెంబరు ఒకటి 2004న సీపీఎస్ విధానం అమలైందని చెప్పారు.

రైతుల వివరాలు నమోదు

చొప్పదండి, ఆగస్టు 29: మండలంలోని చాకుంట, కొలిమికుంట గ్రామాలలో రుణమాఫీ కార్యక్రమాలను నిర్వహించారు.ఈ సందర్భంగా రుణమాఫీలో భాగంగా రైతు కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ప్రియదర్శిని, వ్యవసాయ అధికారి వంశీకృష్ణ, ఏఈఓ సంపత్, రైతులు పాల్గొన్నారు.

విలేకరి చికిత్సకు సహాయం అందజేస్తాం

-మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 29: అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విలేకరి మహేందర్‌కు ప్రభుత్వం పక్షాన ఆదుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. గురువారం క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని ప్రాంతీయ క్రీడా పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ఒలంపిక్ సంఘం ప్రతినిధులు తుమ్మల రమేశ్‌రెడ్డి, నాగిరెడ్డి సిద్దారెడ్డి, గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి మహేందర్ ఆరోగ్య పరిస్థితి గురించి మంత్రి పొన్నంకు వివరించగా మంత్రి స్పందించారు.

విద్యార్థినికి బహుమతి

జమ్మికుంట రూరల్, ఆగస్టు 29: హైదరాబాద్‌లోని రాష్ట్రపతి నిలయంలో బుధవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి వకృత్వ పోటీల్లో జమ్మికుంటకు చెందిన వలిపిరెడ్డి మనస్విత ద్వితీయ స్థానం కైవసం చేసుకోవడంతో గురువారం రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్రపతి భవన్ మేనేజర్ చేతుల మీదుగా బహుమతి అందుకుంది. విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ లావు రుద్రమదేవి మనస్వితను అభినందించారు.

సభ్యత్వ నమోదుకు కృషి చేయాలి

ఇల్లంధకుంట, ఆగస్టు 29: ప్రతీ కార్యకర్త బీజేపీ సభ్యత్వ నమోదుకు కృషి చేయాలని నరసింహరాజు అన్నారు. మండలంలో గురువారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం మండలాధ్యక్షుడు తిరుపతిరెడ్డి ఆధ్వ ర్యంలో నిర్వహించారు.

వీణవంక మండల కేంద్రంలో బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు సన్నహక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ మండలంలో అత్యధిక సభ్యత్వ నమోదు అయ్యేలా చూడలని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎర్రబెల్లి సంపత్ రావు, ఆదిరెడ్డి, పెద్ది మాల్లారెడ్డి పాల్గొన్నారు.

2 నుంచి మండల స్థాయి క్రీడల ఎంపిక పోటీలు

కరీంనగర్ రూరల్ ఆగస్టు29: కరీంనగర్ మండల స్థాయి పాఠశాల క్రీడల ఎంపిక పోటీలను వచ్చేనెల 2వ తేది నుంచి నిర్వహించడం జరుగుతుందని మండల విద్యాధికారి మధుసూదనాచారి గురువారం ప్రకటనలో తెలిపారు. వివరాలకు మండల క్రీడా కార్యదర్శి దుర్శేడ్ జిల్లా పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు రమేష్ (9948749943)లో సంప్రదించాలని తెలిపారు.

● సంక్షిప్త సమాచారం..

●సుభాష్‌నగర్: మంకమ్మతోట లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో తెలుగుభాష దినోత్సవాన్ని నిర్వహించారు. గురువారం స్థానిక మంకమ్మతోటలోగల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ వేడుకల్లో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. శ్రీరామ బుక్ సెల్లర్స్ వారిచే విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్ అందచేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ప్రమీలదేవి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, వేణుగోపాల్‌లను సన్మానించారు. క్లబ్ అధ్యక్షుడు బూర్ల విద్యాసాగర్, కార్యదర్శి అంబటి రవీందర్‌రాజు, కోశాధికారి పాత విశ్వనాథం, చెన్నమాదవుని పవనసుతరాజు, జిల్లా అంజయ్య, జిల్లా కృష్ణమూర్తి, శంకరయ్య, శ్రీపతి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

●కరీంనగర్ అర్బన్: మేయర్ సునీల్‌రావు ప్రజలకు సేవ చేయడం ఏమో కానీ, నిత్యం టార్గెట్లు పెట్టి పెద్ద ఎత్తున వసూళ్ళు చేస్తున్నారని ప్రజలే బాహటంగా విమర్శస్తు న్నారని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు ఒక ప్రకటనలో ఆరోపించారు.

●గణేశ్‌నగర్: పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీస్ మూమెంట్ ఫౌండేడ్ బై బ్రహ్మర్షి పితామహ శుభాష్ పత్రీజీ చే ధ్యాన సాధన, శాఖాహారం యొక్క ప్రాముఖ్యత పై ఎన్ఎస్ఎస్ ఐదు విభాగాల ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ సత్య నారాయణ అధ్యక్షతన హరీష్ కుమార్ కూర్మాచలంచే గురువారం అవగాహన చేపట్టారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ నితిన్, రాజయ్య పాల్గొన్నారు.

●కరీంనగర్ రూరల్: తీగలగుట్టపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీనియర్ గ్రేడ్ తెలుగు పండిత్ ఉపాధ్యాయురాలు సందుగుల శ్రీదేవి గురువారం విద్యార్థులకు విద్యాసామాగ్రిని అందజేశారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కరుణ పాల్గొన్నారు.

●కరీంనగర్ టౌన్: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల (పురాతన)లో విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు షేక్ చాంద్ షూ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జగదీశ్వర్‌రావు, లింగారెడ్డి, వసుంధర, ప్రవీణ్, మాధురి, కృష్ణ మూర్తి, దివాకర్, ఫయజ్ అలీ, నటరాజ్, తిరుపతిరెడ్డి, సునంద, తిరుపతి, పవన్‌కుమార్, రజిత, రఘు, ప్రకాశ్ పాల్గొన్నారు.

●పారిశుధ్య కార్మికులకు 35వడివిజన్ కార్పొరేటర్ చాడగొండ బుచ్చిరెడ్డి గురువారం పిపి కిట్లను అందజేశారు. 53వ డివిజన్ కార్పొరేటర్ శ్రీదేవి చంద్రమౌళి కూడా తన డివిజన్‌లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు కిట్లను అందజేశారు.

●కరీంనగర్ రూరల్: కరీంనగర్ మండలంలో పలు గ్రామాల్లో ఉపాధి హామి పథకం కింద మంజూరైన పశువుల పాక నిర్మాణాలకు గురువారం ఉపాధి హామీ ఏపీఓ శోభరాణి భూమి పూజ చేశారు. మండలంలోని నగునూర్, ఎలబోతారం గ్రామాలకు మూడు యూనిట్లు మంజూరు కాగా భూమి పూజ చేశారు.